క్లుప్తంగా

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



కోస్గి: వాసవీ మాత ఆత్మర్పాణ దినం సందర్భంగా ఆదివారం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక లక్ష్మీవేంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల్లోని ఇంద్రనీలేశ్వర ఆలయంలో అమ్మవారికి అభిషేకం ,కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చల్ల శ్రవణ్, వీరయ్య, సుభాష్, వినోజ్, సురేష్, మహిళ సంఘం ప్రతినిధులు చల్ల రచన, శారదతోపాటు పలువురు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని చీరాల నర్సయ్యతాం



డలో ఆదివారం మైసమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ హన్యానాయక్ ఆధ్వర్యంలో ఆలయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పరుశురాం, చోక్లనాయక్, దామ్లనాయక్, హమ్లనాయక్, ప్రశాంత్, ఉకమ్మ, లక్ష్మమ్మ, నీలమ్మ, లచ్చిబాయి, మంగమ్మ, సుబ్బమ్మ తదితరులు ఉన్నారు.

నల్లగొండ సభను జయప్రదం చేద్దాం

నర్వ: కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించే నల్లగొండ సభను జయప్రదం చేద్దామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఈ నెల 13న నల్లగొండలో జరిగే బహిరంగసభకు మండలం నుంచి భారీగా తరలిరావాలన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు నిర్వహించే ఈ బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

నర్వ: మండలంలోని లంకాల్‌లో పిచ్చికుక్క గత రెండు రోజులుగా స్వైర విహారం చేసిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకునేందుకు వెళ్లిన ఓ బాలుడిపై దాడి చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే మహబూబ్‌నగర్‌లోని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు వారన్నారు. ఈ పిచ్చి కుక్కను పంచాయతీ సిబ్బంది తరిమి వేసి వేరే వారిపై దాడి చేయకుండా చూడాలని కోరుతున్నారు.

'ప్రజాపాలన' వివరాల సేకరణ

ఆత్మకూర్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రూ.500 కే సిలిండర్ పథకానికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరించారు. ఆదివారం స్థానిక మున్సిపాలిటీ కేంద్రంలోని వార్డుల్లో కమిషనర్ నాగరాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఐదు రోజుల్లోగా పట్టణంలోని పది వార్డుల్లో గ్యాస్ సిలిండర్ వినియోగదారుల వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు



ఆత్మకూర్: పట్టణంలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. ఆదివారం పరమేశ్వరస్వామి చెరువు వద్ద తాగునీటి పైప్‌లైన్‌కు చేపడుతున్న మరమ్మతు పనులు పూర్తయ్యాయని తెలిపారు. వారంరోజులుగా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తడంతో తక్షణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి ఏర్పడకుండ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని, సమస్యలుంటే తమదృష్టికి తీసుకురావాలని సూచించారు.

కేంద్రానికి కనువిప్పు కలిగించాలి

ఆత్మకూర్: దేశవ్యాప్తంగా వివిధ పరిశ్రమలపై ఆధారపడి కోట్లాది మంది కార్మికులు జీవిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం పరిశ్రమలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లాకార్యదర్శి హన్మంతు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోష అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈనెల16న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మె, బంద్‌లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజు, ప్రసాద్, రాబర్ట్, వెంకటయ్య, అంజి, కార్మికులు పాల్గొన్నారు.

కుంట శిఖం.. అన్యాక్రాంతం

- ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- రెవెన్యూ అధికారులకు ఇప్పటికే వినతిపత్రాలు అందజేత
- నష్టపోతున్న మత్స్యకారులు
- సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని వేడుకోలు



అమ్మపల్లి గ్రామ చెరువు

మాగనూర్: విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కులకు ఫలహారంగా మారిపోతున్నాయి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను కొంతమంది కబ్జాచేసి తమ పట్టా భూమిగా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రభుత్వ భూమి కనుమరుగవుతోంది. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.

విన్నవించిన ఫలితం శూన్యం..

అయితే గ్రామస్తులు గతకొన్ని నెలలుగా మండల తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందజేసిన ఫలితం మాత్రం శూన్యమని అంటున్నారు. అప్పుడున్న తహసీల్దార్ తిరుపతి అప్పటి వీఆర్‌ఓ రమేష్, ఆర్ఐ నర్సింహులను చెరువు వద్దకు పంపించి చెరువు కుంటశిఖాన్ని సర్వే నంబర్ 186లో 70ఎకరాల 03 గుంటలు భూమి ఉన్నట్లు గుర్తించారు. అందులో వడ్వాట్, అమ్మపల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులు సుమారుగా 18ఎకరాల మేర భూమి కబ్జాకు గురైంది. అయితే అట్టి రైతులకు నోటీసులు జారీచేసి వారి వద్ద ఉన్న డాక్యుమెంట్‌లు తీసుకురావాలని ఆదేశించిన వారు స్పందించలేదని, ఆ తర్వాత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గ్రామస్తులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరించడంతోనే ప్రభుత్వ భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నాయని అధికారులు వాటిని పరిరక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

చెరువుల శిఖం భూములకు హద్దులు ఏర్పాటు చేయడంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెరువుల ఆయకట్టు రైతులు వాపోతున్నారు. మండలంలోని అన్ని చెరువులలో సర్వేచేసి శిఖం భూముల హద్దులను గుర్తించి ట్రాంచ్ కొట్టించి హద్దుల ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించిన ఇంతవరకు పురోగతి లేకపోవడంతో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.



కబ్జాదారులకు జారీ చేసిన నోటీసులు

ప్రభుత్వ భూములు కాపాడాలి..



కబ్జాకు గురైన అమ్మపల్లి చెరువు భుమిపై అధికారులు దృష్టి సారించి భూములను కాపాడాలి. గతంలో తహసీల్దార్‌కు చాలాసార్లు వినతిపత్రాలు అందజేసిన ఫలితం మాత్రం లేకుండా పోయింది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సర్వే చేయించాలి.

– బాలకృష్ణ, రైతు, అమ్మపల్లి.

పట్టించుకోవడం లేదు..



మండలంలోని అమ్మపల్లి చెరువుల శిఖం భూములను కొందరు 18ఎకరాల భూమి కబ్జాకు గురైన సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో అనుమానాలకు తావిస్తుంది. చెరువు శిఖం అక్రమణపై ఉన్నతాధికారులు దృష్టిసారించి ప్రభుత్వ భూమిని కాపాడాలి.

– కృష్ణ, మత్స్య పారిశ్రామిక శాఖ గ్రామ అధ్యక్షుడు

సర్వే చేయిస్తాం..



ప్రస్తుతం కలెక్టర్ ఆదేశాలతో మండల వ్యాప్తంగా ప్రభుత్వ భూముల సర్వే నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా అమ్మపల్లి గ్రామ చెరువును సంబంధిత అధికారులతో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని గుర్తిస్తాం. తప్పకుండా గ్రామస్తులకు న్యాయం జరిగేవిధంగా చర్యలు తీసుకుంటాం.

– సతీష్‌కుమార్, తహసీల్దార్, మాగనూర్

ఘనంగా నంది విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయం వద్ద హోమం చేస్తున్న భక్తులు

ఊట్కూరు: మండలంలోని చెరువుకట్ట సమీపంలో ఈశ్వర్ మందిర్ వద్ద ఆదివారం నందివిగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా నంది విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నేరెడుగం పీఠాధిపతి సమక్షంలో నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు ప్రభులింగం, రఘువీర్, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూసల్‌పహాడ్ టాలెంట్ టెస్ట్‌కు అనూహ్య స్పందన



కోస్గిలో ప్రతిభ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



మక్తల్‌లో..

కోస్గి: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారిని ప్రొత్సహించేందుకు ఆదివారం నిర్వహించిన పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్‌కు అనుహ్య స్పందన లభించింది. ప్రతి సంవత్సరం పదోతరగతి విద్యార్థులకు జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ పరీక్షకు మండల పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా పరిధిలో జరిగిన ఈ పరీక్షల్లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 348మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్ష కన్వీనర్ అంజిలయ్య తెలిపారు. స్థానిక పరీక్షల నిర్వాహణలో తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, రామకృష్ణారెడ్డి, వెంకటేష్, పరంధాములు, తుల్జారాం, నరేందర్‌రెడ్డి, రవితేజ పాల్గొన్నారు. అంతకు ముందు స్థానిక ఎస్సై శ్రీనివాసులు పరీక్ష పేపర్‌ను విడుదల చేశారు.

మాగనూర్: పదోతరగతి విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి టాలెంట్ నిర్వహించడం జరుగుతుందని జెడ్పీఉన్నత పాఠశాల హెచ్ఎం నర్సింహులు అన్నారు. అందులో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ పరీక్షకు మండల పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు రమేష్ కుమార్, తిరుపతి నాయక్, ఉపాధ్యాయులు రాజు, ఖాజాహుస్సేన్, వెంకటేష్ పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని సంగంబండ గురుకుల పాఠశాలలో పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్ ఆదివారం ప్రశాంతంగా కొనసాగింది. విద్యార్థులు వెయ్యి మంది విద్యార్థులు పరీపాల్గొన్నారు. ఈ పరీక్షకు మండల పరిధిలోని పలు పాఠశాలల నుంచి దాదాపు వెయ్యిమంది విద్యార్థులు హాజరయ్యారు.

ఊట్కూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. 72మంది పదోతరగతి విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింగప్ప, కర్ణాకర్, గోపాల్, తబీబ్, రాము తదితరులు పాల్గొన్నారు.



మాగనూర్‌లో..

నేడు భక్త మార్కండేయ స్వామి జయంతి

ధన్వాడ: నేడు శ్రీ భక్తమార్కండేయస్వామి జయంతిని నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాలరాజు తెలిపారు. ఉదయం 5గంటలకు స్వామి వారి అభిషేకం, 7గంటలకు స్వామివారి అలంకరణ, 10 గంటలకు డోలారోహణం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎంపీడీఓల బదిలీ

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా పలువురు ఎంపీడీఓలు బదిలీ అయ్యారు. నారాయణపేట నుంచి మహబూబ్‌నగర్‌కు కాలప్ప, శ్రీనివాస్, య శోదమ్మ, సుధాకర్ రెడ్డి, జోగులాంబ గద్వాలకు వెంకటయ్య, రమేష్‌కుమార్, వనపర్తికి సద్గుణ, సిద్దిపేటకు విజయలక్ష్మిని కేటాయించారు. అదేవిధంగా సూర్యపేట నుంచి జానయ్య, గద్వాల నుంచి గో విందరావు, సాయిప్రకాష్, మహబూబ్‌నగర్ నుంచి జయరాములు, జ్యోతి, శ్రీనివాసులు, ధనుంజయ్‌గౌడ్‌లను నారాయణపేటకు కేటాయించారు.

ధన్వాడ: ఎంపీడీఓ విజయలక్ష్మి బదిలీ అయ్యారు. అదివారం జిల్లా నుంచి 8మంది ఎంపీడీఓలు బదిలీ లు అవగా అందులో ధన్వాడలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. త్వరలో కొత్త ఎంపీడీఓను కలెక్టర్ నియమించనున్నారు.

బాలస్వామికి అవార్డు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విశ్వగురు వరల్డ్ రికార్డు అవార్డును జిల్లా కేంద్రానికి చెందిన సీపీఎస్ఉద్యోగ సంఘం అధ్యక్షుడు సనాతన బాలస్వామి అందుకున్నారు. విశ్వ గురు వరల్డ్ రికార్డు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో కార్యక్రమం జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు సత్యవోలు రాంబాబు అవార్డు అందజేశారు.

క్రీడాకారులకు అభినందనలు

మహబూబ్‌నగర్ క్రీడలు: కొత్తగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను ఆదివారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర తదితరులు అభినందించారు. పతకాలు సాధించిన వారిలో అంకుర్ జీవన్ (రజత పతకం), బ్రిందయాదవ్ (కాంస్య పతకం) తదితరులు ఉన్నారు.

వీహెచ్‌పీని పటిష్టం చేస్తాం



మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగిశెట్టి జగదీశ్వర్



సమావేశానికి హాజరైన భక్తులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విశ్వహిందూ పరిషత్‌ను పటిష్టం చేస్తామని వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగిశెట్టి జగదీశ్వర్ అన్నారు. ఆదివారం శివశక్తినగర్‌లోని ప్రజ్ఞ హైస్కూల్ ఆవరణలో రామభక్తుల సమ్మేళనం, సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్య రాముల ప్రతిష్ట మహోత్సవంలో హైంధవులందరూ పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామ గ్రామాన ధార్మిక కార్యక్రమాలు ఉట్టిపడేలా రాముని విగ్రహ ప్రతిష్టకు సంబంధించి ప్రచారం చేయడం బాగుందన్నారు. గ్రామాల్లోని ప్రతి దేవాలయాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో ధర్మరక్షణ సమితి పేరుతో కమిటీలు వేసుకోవాలన్నారు. అంతకుముందు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆధ్వర్యంలో గడపగడపకు పంచి అక్షింతల వితరణలో పాల్గొన్న రామ భక్తుల అనుభవాలను తెలుసుకున్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర రాష్ట్ర సంయోజకుడు గణపురం రాజేశ్వర్‌రెడ్డి, సహ కార్యదర్శి రాజేశ్వరి, పాలమూరు నగర సంయోజకుడు మద్ది యాదిరెడ్డి, విభాగ సహ కార్యదర్శి మఠం రాజయ్య, జిల్లా అధ్యక్షుడు గుద్దటి చంద్రయ్య, సహ కార్యదర్శి బుట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు పంపిణీ చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: గొర్రెల పంపిణీ పథకం కింద దరఖాస్తు చేసుకొన్నవారిలో చాలామందికి ఇప్పటికీ లబ్ధిచేకూరలేదని జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ చైర్మన్ శాంతయ్య యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మావతీకాలనీలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ప్రాథమిక సభ్యులు (గొర్రెల కాపరుల) 16,072 మంది ఉన్నారని.. గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించగా కేవలం 1377 మందికి పంపిణీ చేశారని అన్నారు. మిగిలిన వారు ఇప్పటికీ ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి గొర్రెలను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ బాలయ్య యాదవ్, డైరెక్టర్ రాజగోపాల్ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాంతయ్య యాదవ్

ఏబీసీ సాధనకు ఐక్యంగా పోరాడుదాం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న స్వామిజీ, ఎమ్మెల్యే

నారాయణపేట రూరల్ : వీరశైవ లింగాయత్ – లింగబలిజ సంఘానికి ఓబీసీ సాధించుకునేందుకు ఐక్యంగా పోరాటం చేయాలని నేరెడ్‌గామ్ మఠాధిపతి శ్రీ పంచమసిద్ధలింగ మహాస్వామి అన్నారు. స్థానిక శివలింగేశ్వర ఆలయంలో ఆదివారం నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి పిల్లల్లో ఆధ్యాత్మిక చింతన వైపు నడిపించాలని అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వీరశైవులకు వైకుంఠదామం, జిల్లాకేంద్రంలో భసవభవన్, బసవేశ్వర విగ్రహ ఏర్పాటుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గందె అనసూయ చంద్రకాంత్, మాజీ ఎంపీపీ సదాశివరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బండివేణుగోపాల్, సమాజం అధ్యక్షుడు అవుటి రవికుమార్, మాజీ అధ్యక్షుడు గందె రవికాంత్, శివకుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

దీన్‌దయాల్ అడుగుజాడల్లో నడవాలి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్‌దయాల్ ఉపాధ్యాయ అడుగుజాడల్లో ప్రతి కార్యకర్త నడిచి ఆదర్శంగా నిలవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యాయాదవ్ అన్నారు. ఆదివారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో దీన్‌దయాల్ వర్ధంతిని నిర్వహించారు. ఈ మేరకు.. దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దీన్‌దయాల్ ఆశయసాధనకు ప్రధాని మోదీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో గోపాల్, రాము, శ్రీనివాస్, మోహన్, మొగలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘననివాళి



నారాయణపేటలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నారాయణపేట రూరల్: చలనచిత్ర పరిశ్రమలో ప్రత్యేకత సంతరించుకున్న గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని ఆదివారం బాలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం ఎస్పీ బాలు ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ సుమధుర కంఠంతో ఆలపించిన పాటలు ఎంతోమంది శ్రోతలను అలరించాయన్నారు. నేటితరం గాయకులకు ఆయన మార్గం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో టీవీ రేడియో గాయకులు సంఘ నర్సింహులు, అక్కల లక్ష్మణ్, వసంత్, రామకృష్ణ కల్యాణి, నాగరాజు, నవనీత, రఘు, బాలు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని కళాకారులు ఆదివారం ఘంటసాల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కె.రాములు, ఘంటసాల సాంస్కృతిక సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరిప్రసాద్, శ్రీమిత్ర కళానాట్య మండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ, కళాకారులు ఎస్.నర్సిములు, రామకళ, యాదయ్య, కె.లక్ష్మణ్, విజయకుమార్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో..

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గిరిజనులు

మద్దూరు: శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించడంపై సేవాలాల్ కొత్తపల్లి మండల కమిటీ సభ్యులు సీఎం రేవంత్ చిత్రపటానికి ఆదివారం కొత్తపల్లిలో క్షీరాభిషేకం నిర్వహించారు. సేవాలాల్ జయంతి సెలవు దినంగా ప్రకటించడంపై హర్షంవ్యక్తం చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ మండల కమిటీ అధ్యక్షుడు లాలునాయక్, కార్యవర్గ సభ్యులు రవినాయక్, శ్రీను, రమేష్‌నాయక్, రఘునాయక్, పాండునాయక్, రమేష్, భాస్కర్, అనిల్, కాశ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ఘర్ పునర్‌నిర్మాణం చేపట్టండి



ఉర్దూఘర్‌ను పరిశీలిస్తున్న ముస్లిం సంఘాల నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సమైక్య రాష్ట్రంలో నిర్మించిన ఉర్దూఘర్ శిథిలావస్థకు చేరినా గత పాలకులు పట్టించుకోలేదని, దీనిని పునర్‌నిర్మాణం చేపట్టాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, ఈమాన్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ సలీం కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఉర్దూ ఘర్‌ను వివిధ ముస్లిం ప్రజాసంఘాల నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని నడిబొడ్డున ఉన్న ఉర్దూ ఘర్ శిథిలావస్థకు చేరడంతో ముస్లిం సమావేశాలు చేసుకోవడానికి కష్టంగా ఉందన్నారు. పేద ముస్లింల వివాహాల కోసం కన్వెన్షన్ హాల్ నిర్మించడానికి ప్రభుత్వం చొరవ చూపాలని, ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే వీటి నిర్మాణానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం సంఘాల నాయకులు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అయాబ్, మహ్మద్ ఉమర్ ఫారుఖ్, నిజాముద్దీన్, జావెద్, అబ్దుల్లా సున్నీ, ఇమ్రాన్‌ఖాన్, ఎం.ఎ.ముఖిద్, నదీం, నవాజ్ పాల్గొన్నారు.